# వృత్తి దోషాలు

మనం చేస్తున్న వృత్తుల ప్రభావంమనకీ తెలీకుండానే మనపైన పడిపోతుంది. మన మాటల్లో చేతల్లో మార్పు వచ్చేస్తుంది. పడికట్టు పదాలు అలవాటయిపోతాయి. మాటలధోరణిని బట్టి ఎవరేం వృత్తిలో వున్నారో ఇట్టే చెప్పొచ్చు. తొలిరాత్రి గదిలో కెళ్ళగానే లైటింగు సరిగా లేదంటూ కుర్రాడు బయటికొచ్చేసాడనుకోండి, అతడిని కెమారామెన్నుగా గుర్తించండి. అలాగే, భార్య పండక్కి బట్టలు కొనకపోతే పుట్టింటికి పోతానని నొక్కి వక్కాణించింది. అప్పుడే పెట్టెగూడా సర్దుకుందని అభిజ్ఞాన వర్గాల బోగట్టా. ఇటువంటి చర్యలన్నీ ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు వగైరా పదాల్ని ప్రయోగిస్తుంటే కుర్రాడు పేపరు ఆఫీసులో పన్చేస్తాడని తెల్సుకోవాలి. అలాగే చెట్టంత మొగుడిని పట్టుకుని ' హెూం వర్కు చేయక ' పోతే ఎలా అంటూ సాధిస్తూ, బేడ్‌బాయ్ అని టైటిలుగూడా ప్రదానం చేస్తే ఆవిడ టీచరమ్మని తెలుసుకోండి. ఇహ ప్రజాసేవలో వున్న వాళ్ళు ఇంట్లోగూడా ఒక పట్టాన దేనికీ కమిట్ కారు. ఏం అడిగినా ఆలోచిద్దాం. అనో, పరిశీలిస్తాం అనో, అధిష్టాన వర్గం దృష్టికి తెస్తున్నాననో, అదీ ఇదీ కాకపోతే నో కామెంట్స్ అనో అంటుంటారు. పెద్దాడు చిన్నాడిని చితక బాదేడని చెప్తే , చిన్నవాడికి ఓ యాభై రూపాయలు ఎక్స్ గ్రేషియాని ప్రకటిస్తారు. ఇంకా కావాలంటే న్యాయవిచారణ జరిపిస్తాం పొమ్మంటారు. ఇహ రచయితలు సరే సరి. పాయింటు కోసం ప్రతివాళ్ళ సోదిని శ్రద్దగా వింటుంటారు. పక్కింటి వాళ్ళమ్మాయిని మొగుడు డబ్బులు తెమ్మని చిత్రహింసలు పెడుతుంటే పాపం ఆపిల్ల కిర్సనాయిలుతో – ఇంకా చెప్పేది పూర్తి కానివ్వకుండానే ' గ్యాసు నూనె భారతం ' అనో , ' తిరిగి రాని వసంతం ' అనో టైటిల్ని కెవ్వున అరిచి మరీ ప్రకటిస్తారు. మన దగ్గర బంధువుల్లో ఎవరయినా డాక్టరయితే మరీ ఇబ్బంది . వచ్చిరాగానే అసలు సంగతులు అవతలకి నెట్టి ప్రతివాళ్ళనీ పేరు పేరు వరుసనా షుగరుందా ? బీపి చెకప్ చేయించకున్నారా ? ఎనిమిగ్గా కనిపిస్తున్నారు. ఏం వాడుతున్నారంటూ పలకరిస్తారు. పైగా పాతికేళ్ళ కే గుండె జబ్బు వచ్చిన వాళ్ళ గురించీ ,నలభైకే పక్షవాతం వచ్చిన వాళ్ళని గురించి చెప్పి ఆరోగ్యాలు చెడకొడతారు. ఇంకా వివరాలు కావాలంటే డాక్టరుగారి భార్యని కదిపి చూడండి. సినిమా కెడదావంటే రక్తపోటు పెరిగి, బ్రెయిన్ సెల్సు దెబ్బతింటాయంటారు. పోనీ షికారుకి పోదావంటే గాలి కాలుష్యం దుమ్ము, ధూళివల్ల ఊపిరి తిత్తులు పాడయిపోతాయంటారు. ఇహ పాతికేళ్ళు పౌరాణీకి పాత్రలు ధరించిన వ్యక్తిని కాస్త నిశితంగా పరీక్షించదండి. ఆ

మాటల్లో కదలికల్లో దుర్యోధనుడో, గయుడో, నారదుడో మనకి కొట్టొచ్చినట్టు కనిపిస్తారు. అలాగే డాన్స్ మాస్టార్ని నడకలో నాట్యాన్ని, సంగీతం మాష్టారి గొంతులో కూని రాగాన్ని మనం దర్శించుకోవచ్చు. సిటీ బస్సు డ్రయివరు స్కూటరుపైన భార్యతో షికారుకు బయల్దేరినా ఆగవలసిన గమ్యాన్ని దాటి వెళ్ళిపోయి సారీ అంటాడు. అదే కండక్టరయితే , హొటల్లో సర్వరు బిల్లు ఇవ్వగానే, దాన్ని టప్ మంటూ తిప్పి సంతకం చేసి ఇంటికొచ్చి డబ్బులు తీసుకెళ్ళమంటాడు. ఇవన్నీ వృత్తి దోషాలు.

ఈ మధ్యన ఒక పెళ్ళి చూపుల కార్యక్రమానికి వెళ్ళాల్సి వచ్చింది. పెళ్లి కూతురు తండ్రికి దుకాణం వుంది. ఆయన కూతురి గుణ గణాల గురించి చెప్తూనే, దుకాణం భాషలోకి జారిపోయేరు . ' మా అమ్మాయని గొప్పలు చెప్పటం కాదుగానీండి , స్టాండర్డు మిల్సు గుడ్డలాంటిది. కలరు పోదు, షింకవదు , అసలు మా వంశం పెద్ద పన్నా తాను లాంటిది. కావాలంటే ఎంక్వయిరీ చేసుకోండి. సరకు నచ్చకపోతే వాపసిచ్చేయ్యండి " ఇలా అనర్గళంగా చెప్పుకుపోతుంటే పిల్లవాడి తండ్రి : మధ్యలో అందుకుని మీరింతగా చెప్పాలా బావగారూ ! మీ దుకాణం ఇప్పటిదా ? అయినా ఇందులో నాదేం వుంది చెప్పండి. పెద్దాడు ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఇహ వీడు రెండో వెధవ గౌరవం కొద్దీ మీదే పూచీ అన్నాడు. ఎక్స్‌ప్రెస్ బండో, ఆక్కుండా పోయిందన్న అక్కసుతో ఆగిన పాసింజరు బండీని నొక్కి పెడతామా ? తప్పుగాదూ ! గంటకొట్టి, జెండా వూపొద్దు ! వారు స్టేషన్ మాష్టారు గిరీ వెలిగించి ఇటీవలే ప్రజల్లో పడ్డారని తర్వాత తెలిసింది.

ఇలా మాటల్లో మన వ్యాపకాలు, వ్యవహారాలూ బయటపడి పోతుంటాయి . అసలు ఏ వృత్తి, ప్రవృత్తి లేకుండా పిత్రార్జితాన్ని కరిగించుకుతింటూ కాలక్షేపం చేసే అదృష్టవంతులుంటారు. వాళ్ళని మాటల్లో పట్టుకోవడం కాస్త కష్టమే ? కానీ – ఇరాకు దాడి గురించి జర్మనీ విలీనం గురించి, పాకిస్థాన్ ఎన్నికల గురించి, మండల్ కమీషన్ వివాదం గురించీ తీరుబడిగా మాట్లాడుతూ క్షణ క్షణానికి వాచీ వంక చూసుకుంటుంటే , ఈ బాపతు శాల్తీగా అనుమానించవచ్చు. ఇలా ఇంకా చాలా వృత్తులున్నాయ్. అంచేత వృత్తి దోషాలు అనేకం. చివరగా – న్యాయమే గెల్చింది అని లాయరుగారు చెప్పగానే, అయితే వెంటనే హైకోర్టుకి అప్పీలు చేయండి అనే క్లయింటు ఏ వృత్తిలో వున్నాడో చెప్పుకోండి చూద్దాం. !

------- అయ్యిపోయింది -------